
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శనివారం, 2 మార్చి 2024

5



శుక్రవారం ఉష్ణోగ్రత	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	36	23
భద్రాద్రి కొత్తగూడెం	35	24



భద్రాచలంలో డీఆర్‌సీసీ షెడ్ నిర్మాణం

- దశాబ్దకాలంగా కాలుష్య కోరల్లో చిక్కుకున్న కరకట్ట
- రూ.80 లక్షలతో సాగుతున్న డీఆర్‌సీసీ నిర్మాణ పనులు
- రూ.1.30 కోట్లతో తడి, పొడి చెత్త క్రష్ యంత్రాలు
- నెల రోజుల్లో అందుబాటులోకి శాశ్వత డంపింగ్ యార్డు

గోదావరి తీరం ఇక పావనమే..

6



- తేజల్ సర్వేక్షణ్ ఫలితాల్లో అవార్డు
- తాగునీరు, వ్యర్థజలాల పునర్వినియోగంలో సమర్థతకు దక్కిన గుర్తింపు
- 5న ఢిల్లీలో అవార్డు అందజేయనున్న రాష్ట్రపతి
- సమష్టి కృషి ఫలితమన్న మేయర్, కమిషనర్

జాతీయ స్థాయిలో మెరిసిన కేఎంసీ

7



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్)ఆర్‌ఐ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్

ఖమ్మం వేదికగా చరిత్రాత్మక ఘట్టం

- కమ్యూనిస్టు, విప్లవపార్టీల జాతీయ ఐక్యతా తొలి అడుగు
- మాస్‌లైన్ జాతీయ పార్టీ ఆవిర్భావం కీలక మలుపు
- రేపటినుంచి మూడు రోజులపాటు జాతీయ మహాసభలు
- 16 రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధుల రాక
- రేపు సాయంత్రం భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- సీపీఐ(ఎంఎల్)ఆర్‌ఐ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 1: విప్లవాలు, ఉద్యమాల పురిటిగడ్డ ఖమ్మం గుమ్మం నుంచి విప్లవ జాతీయ పార్టీ మాస్‌లైన్ ఆవిర్భావం జరగటం చరిత్రలోనే ఒక పేజీగా మిగిలిపోతుందని సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) జాతీయ కార్యదర్శి సుభాష్‌దేవ్ పేర్కొన్నారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

1967లో జరిగిన నక్సల్బరీ ఉద్యమం తర్వాత అనేక సిద్ధాంతాల వైరుధ్యాల నడుమ 1969లో సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు జరిపి కాలంతోపాటుగా ప్రజా అవసరాలు, సిద్ధాంతాలు, రాజకీయ విధానాలు మార్పు చెందటంతో సీపీఐ(ఎంఎల్) అనేక విభాగాలుగా విడిపోయిందని చెప్పారు. దేశంలో ఫాసిస్టు, మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు విప్లవ పార్టీలు ఐక్యంగా ఒకే జాతీయ పార్టీగా మారేందుకు తొలి అడుగులు వేశామని అందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా చారిత్రక వేదికగా మారిందని పేర్కొన్నారు.

మారిన సమాజ పరిస్థితులకు అనుగుణంగా విప్లవ పార్టీలు తమ పంథాలను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో దేశంలోని ప్రజాస్వామ్యం, లౌకిక విధానాలు ప్రమాదకర స్థితిలోకి వెళ్లిందన్నారు. మాస్‌లైన్ పార్టీ ఆవిర్భావం కోసం 15నెలలుగా జాతీయస్థాయిలో విప్లవ పార్టీలు అనేక సిద్ధాంతాలు, వైరుధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకోవటం జరిగిందన్నారు. ఆ తర్వాతనే మూడు విప్లవ పార్టీలు సమైక్య స్ఫూర్తితో మాస్‌లైన్ పార్టీగా ఆవిర్భావం కోసం నిర్ణయం జరిగిందన్నారు. ఈనెల 3,4,5న ఖమ్మంలో జరిగే మాస్‌లైన్ జాతీయ మహాసభలకు 16 రాష్ట్రాల నుంచి 300మంది ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. 3న 30వేల మంది కార్యకర్తలతో భారీ ప్రదర్శన, 4,5న ప్రతినిధుల సభలు, జాతీయ కమిటీ ఎన్నిక జరుగుతుందని వివరించారు. జర్మనీ, నేపాల్, బంగ్లాదేశ్, ఇతర దేశాల నుంచి ప్రతినిదులు హాజరవుతున్నారని వివరించారు.

పోటు రంగారావు మాట్లాడుతూ మాస్‌లైన్ మహాసభల ఏర్పాట్లను వివరించారు. పెవిలియన్ మైదానంలో జరిగే బహిరంగ సభకు అమరవీరులు రాయల రవన్న, సంతోష్‌రాణా పేర్లు నామకరణం చేశామన్నారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో రెండు రోజులపాటు నిర్వహించే ప్రతినిధుల సభలకు డీవీ కృష్ణ, భాస్కర్‌నందీ శర్మిష్ఠ, శివరామ్ పేర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేజీ రాంచందర్, కె.రమ, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలుచేసి తీరుతాం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 6



- అమాయకుల ఆధార్ కార్డులు సేకరించి బ్యాంకు ఖాతాలు
- రుణాలు ఇస్తామని నమ్మించి ఖాతాల దుర్వినియోగం
- అకౌంట్ హోల్డర్లకు తెలియకుండానే లక్షల్లో లావాదేవీలు
- రూ.10వేల నుంచి రూ.20వేలు నగదు ముట్టచెబుతున్న వైనం
- కొందరు గ్రామదీపికలు, ఏజెంట్ల ద్వారా వ్యవహారం
- ప్రైవేటు బ్యాంకులే కేంద్రంగా లావాదేవీలు
- దందా చేస్తున్నది సైబర్ నేరగాళ్లా..? హవాలా బ్రోకర్లా..?
- ఇప్పటికే ఇల్లెందులో వెలుగుచూసిన మోసాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సైబర్ దా'రుణాలు'

రుణాల వెనుక ఘరానా దొంగలు

ఖమ్మం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలానికి చెందిన ఓ గ్రామదీపిక.. స్థానికులైన ఐదుగురు మహిళలకు రూ.20 వేల చొప్పున లోన్లు ఇప్పిస్తామని చెప్పి ఖమ్మంలోని ఓ ప్రైవేటు బ్యాంకుకు తీసుకొచ్చి అకౌంటు తీయించింది. అనంతరం వారి అకౌంట్లలో నగదు జమ కాగా, వారి నుంచి బ్యాంకు పత్రాలను, చెక్కులను తీసుకొని, నగదును డ్రా చేసుకుని వచ్చి మరుసటిరోజు సదరు మహిళలకు రూ. 14వేల చొప్పున ఇచ్చింది.

ఇంత వరకు బాగానే ఉండగా.. నెల రోజుల తర్వాత మరో ప్రైవేటు బ్యాంకు నుంచి ఉద్యోగులు సదరు మహిళల ఇళ్ల వద్దకు వెళ్లి మీ పేరిట ఉన్న కరెంట్ అకౌంట్లలో రూ.30 లక్షలకు పైగా నగదు ఉందని, చిరునామా పరిశీలనకు వచ్చామని చెప్పారు. దీంతో వారు అవాక్కయి ఖమ్మంలో ఉన్న బ్యాంకు వద్దకు వెళ్లి వివరాలు కనుక్కోగా.. తమ పేరుతో ఉన్న అకౌంట్లలో రూ. కోట్లలో లావాదేవీలు జరిగినట్టు తేలింది. ఆ తర్వాత వారు తాము తొలిసారి లోను తీసుకున్న బ్యాంకు వద్దకు వెళ్లి లోను గురించి కనుక్కోగా.. 'అసలు మీ పేరుమీద లోను ఇవ్వలేదు.. అకౌంట్లలో పడిన నగదు ఎవరో బదిలీ చేశారు..' అని చెప్పడంతో మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఇదే తరహాలో ఖమ్మం నగరంలోని మరో గ్రామదీపిక కూడా ఏజెంటుగా వ్యవహరించి లోన్లు ఇప్పించినట్టు తెలిసింది. వందల సంఖ్యలో వ్యక్తుల ఆధార్‌కార్డుల ద్వారా లోన్లు ఇప్పిస్తానని చెప్పి వారిపేరు మీద వచ్చిన నగదులో ఎంతోకొంత చేతిలో పెడుతున్నట్టు కొందరు బాధితులు చెబుతున్నారు. నగరంలో ఓ వ్యక్తికి రూ.35వేల లోను ఇప్పిస్తానని చెప్పిన గ్రామదీపిక ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకుని ఓ ప్రైవేటు బ్యాంకు వద్దకు రావాలని సూచించింది. బ్యాంకు దగ్గరకు వెళ్లిన తర్వాత సదరు వ్యక్తితో పాటు మరో ఆరుగురిని చూపించి, బ్యాంకులో రూ.35వేల లోను మంజూరు అయిందని చెప్పి.. సంతకాలు చేయించుకుని సదరు వ్యక్తిని ఇంటికి పంపింది. అనంతరం సాయంత్రం ఇంటికి వచ్చి రూ.10వేలు మాత్రమే ఇచ్చింది. ఇదేంటని అడిగితే మీరు తీసుకున్న నగదు చెల్లించే పనిలేదని చెప్పింది. నగదు చెల్లించనప్పటికీ ఎవరూ ఎందుకు అడగడంలేదన్నది సదరు వ్యక్తికి ప్రశ్నార్థకంగా మారింది. మరో వ్యక్తికి, ఆయన తల్లికి రూ.75 వేల వరకు వచ్చాయని చెప్పి వారికి కూడా కొంత నగదు ఇచ్చి తిరిగి చెల్లింపులు చేసే అవసరం లేదని చెప్పినట్టు తెలిసింది. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో జరిగినట్టు ప్రచారం జరుగుతోంది.

బ్యాంకు లోన్లు కానేకావు..

నిజానికి బ్యాంకులు లోన్లు ఇస్తే లబ్ధిదారులు తిరిగి చెల్లించాలంటూ నోటీసులు పంపాల్సి ఉంటుంది. కానీ ఆయా సంఘటనల్లో ఎక్కడా బ్యాంకుల నుంచి ఆధార్‌కార్డు, ఫొటోలు ఇచ్చిన వ్యక్తుల వద్దకు విచారణకు కానీ, లోన్లు చెల్లించాలని నోటీసులు కూడా పంపకపోవడంతో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ అక్రమాల్లో స్థానిక ఏజెంట్లుగా కొందరు గ్రామదీపికలు ఉన్నట్టుగా సమాచారం. వారికి డ్వాక్రా సంఘాలలోని మహిళలకు లోన్లు ఇప్పించడం అలవాటే కాబట్టి ఈ తతంగాన్నంతా నడిపిస్తున్నారనీ అంటున్నారు. వాస్తవానికి ఏదైనా డ్వాక్రా సంఘాలకు లోన్లు ఇవ్వాలంటే ముందుగా ఓ గ్రూపు సిద్ధం చేసుకుని దానికి సంబంధించిన రికార్డులు చూపించి బ్యాంకులో లోను కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం జరిగే లోన్ల వ్యవహారంలో అలాంటివేమి లేకుండా నేరుగా బ్యాంకులకు తీసుకెళ్లడం గమనార్హం.

ఆధార్ ఇచ్చుకో.. రుణం తీసుకో...

కేవలం ఒక్క ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు ఇస్తే చాలు లోన్లు ఇప్పిస్తామంటూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులకు కేటుగాళ్లు ఎరవేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా కమీషన్లు ఇచ్చి ఏజెంట్లను నియమించుకున్నట్టు సమాచారం. ఆయా ఏజెంట్లు ప్రాంతాన్ని బట్టి, బ్యాంకులను బట్టి,వ్యక్తులను బట్టి ఒక్కొక్కరు ఒక్కో రకమైన పద్ధతిలో అమాయకుల కేవైసీ వివరాలను సేకరించి అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.

ముందుగా కేటుగాళ్లు స్థానిక ఏజెంట్ల ద్వారా కొంతమంది లబ్ధిదారులను పోగేసుకుని బ్యాంకుల వద్దకు తీసుకెళ్తారు. కొన్ని సందర్భాల్లో అకౌంట్లు తెరిపించి వాటిల్లో కొంత నగదు జమ చేయడం, మరికొన్ని సందర్భాల్లో వ్యక్తులను గ్రూపుగా చూపించి చెక్‌లు రాయించుకున్నట్టుగా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కేవలం ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఒక్కో విడతలో సుమారు ఆరునుంచి పదిమందిని సిద్ధం చేసిన తర్వాత బ్యాంకు వద్దకు తీసుకెళ్లి వారికి ఒక్కొక్కరికి రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు లోన్లు మంజూరు అయినట్టుగా చెబుతున్నారు.

కొందరితో నేరుగా అకౌంట్లు తెరిపించి ఆయా అకౌంట్లలో నగదు జమచేయించి, ఆ తర్వాత వారితో చెక్‌లు, విత్‌డ్రా పేపర్లపై సంతకాలు చేయించుకుంటున్నారు. అనంతరం ఏజెంట్లు సంబంధిత అకౌంటుదారుల ఇళ్లకు వెళ్లి కొంత నగదు కమీషన్‌గా తీసుకుని మిగిలిన నగదు నేరుగా వారికి అందజేస్తున్నారు. తిరిగి నెలనెల కొంత మొత్తంలో చెల్లించాలని చెబుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో బ్యాంకు దగ్గరకు తీసుకెళ్లి ఆయా వ్యక్తులకు బ్యాంకులో ఎవరో ఒకరిని అధికారి అంటూ చూపించి, వారిని సదరు వ్యక్తికి చూపించి ఇళ్లకు పంపిస్తున్నారు. ఆయా వ్యక్తులకు అకౌంట్లు ఓపెన్ చేయకుండానే సాయంత్రం ఇళ్లకు వెళ్లి నగదు ఇస్తున్నారు.

సైబర్ నేరగాళ్లా..? హవాలా బ్రోకర్లా..?

అమాయక ప్రజల నుంచి ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుంటున్న స్థానిక ఏజెంట్ల ద్వారా సంబంధిత కేవైసీలతో కేటుగాళ్లు ఎక్కడెక్కడో బ్యాంకుల్లో కరెంటు అకౌంట్లు తెరిచి వాటిల్లో రూ.కోట్లలో లావాదేవీలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. వాటిల్లో ఎక్కువశాతం ఏదో ఒక ట్రేడర్స్ పేరుమీద అకౌంట్లు ఉండటం గమనార్హం. అంతేకాదు ఆయా అకౌంట్లలో లావాదేవీలు కూడా ఇతర రాష్ట్రాలనుంచి జరుగుతుండగా.. అత్యధికంగా హర్యానా, యూపీ, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల నుంచి సంబంధిత అకౌంట్లలో నగదు లావాదేవీలు జరిగినట్టు సమాచారం.

ఇదంతా సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో భాగమే అని నిపుణులు భావిస్తున్నారు. ఫలితంగానే ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు టాస్కల పేరుతో విసురుతున్న వలలో వారిచ్చే అకౌంట్ నెంబర్లలో ట్రేడర్స్ వంటి కంపెనీలకు సంబంధించిన అకౌంట్లే ఉండటం కూడా ఇది సైబర్ నేరగాళ్ల పనిగా పోలీసులు. భావిస్తున్నారు. వందల కొద్దీ సోషల్ మీడియా సబ్‌స్క్రిప్షన్, ఇతర టాస్కలను బాధితులకు ఇస్తున్న సైబర్ నేరగాళ్ల వివరాలను పరిశీలిస్తే వాటిల్లో నేరగాళ్ల అడ్రస్‌లు మాత్రం ఆయా రాష్ట్రాలకు చెందినవే ఉండటం గమనార్హం. ఆయా అకౌంట్లలో పడిన నగదు కూడా వెంటనే విత్ డ్రా అయిపోవడంతోపాటు, ఇటీవల ఇల్లెందులో వెలుగులోకి వచ్చిన ఘటనలో సదరు అకౌంట్లు ఫ్రీజ్ అవడానికి కార ణం కూడా అదే అయిఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సదరు అకౌంట్లలో జమ అయిన తర్వాత.. సైబర్ నేరగాళ్ల బాధితులు ఫిర్యాదు చేసిన కారణంగా వెంటనే అవి ఫ్రీజ్ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ మోసాల వల్ల కొన్ని సందర్భాల్లో అకౌంట్లు కలిగి ఉన్న వ్యక్తులనే నేరగాళ్లుగా పరిగణించే అవకాశమూ లేకపోలేదు. అంతేకాదు మరొక కోణంలో హవాలాలో సొమ్మును బ్లాక్ నుంచి వైట్‌గా మార్చేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అయితే దీనిపై తీగ లాగితే డొంక కదిలే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది.

పడిపోయిన మిర్చి ధరలు



మెయిన్ గేట్ ముందు బైఠాయించిన రైతులు

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతుల ఆందోళన
- జెండాపాటకు, కొనుగోలు ధరకు భారీ వ్యత్యాసం
- నాలుగు గంటల పాటు స్తంభించిన కొనుగోళ్లు

ఖమ్మం మార్కెట్, మార్చి 1: మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి. అసలే మిర్చి పంటకు వైరస్, ఎర్రనల్లి, గుబ్బ రోగాల కారణంగా పంట దిగుబడి భారీగా తగ్గి బాధపడుతుంటే పండిన అరకొర పంట అమ్ముకుందామని మార్కెట్‌కు తీసుకొస్తే దళారులు ధరలు తగ్గించి నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మిర్చి ధరలు తగ్గించడంపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

ధరల తగ్గుదలపై ఆందోళన

మార్కెట్‌లో శుక్రవారం ఉదయం తేజ రకం మిర్చిని క్వింటాలు రూ.20,800 జెండా పాట ధర నిర్ణయించి రూ. 14,000 నుంచి 18,000 వరకు మాత్రమే కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహించారు. జెండా పాట ధరకు, కొనుగోలు చేసే ధరలకు క్వింటాలుకు సుమారు రూ.3,000 నుంచి రూ.7,000 తగ్గించడంపై రైతులు ఆందోళన చేశారు. జెండాపాట ధర కొనుగోలు ధరలకు భారీ వ్యత్యాసం ఉండటమేంటని అధికారులను ప్రశ్నించారు. కొద్ది రోజులుగా మార్కెట్‌లో మిర్చికి క్వింటాలుకు రూ.21000 నుంచి రూ. 22,000 వరకు దక్కుతుండగా రెండు, మూడు రోజుల వ్యవధిలోనే క్వింటాలుకు రూ.5000 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో మిర్చి రైతులు భగ్గుమన్నారు. జెండా పాట కార్యక్రమంలో మార్కెట్‌లో ఉన్న సుమారు 100మంది మిర్చి ఖరీదుదారుల్లో ఒకరిద్దరు తప్ప మిగతావారు పాల్గొనట్లేదని వ్యాపారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు శుక్రవారం సుమారుగా 70వేల మిర్చి పంట అమ్మకానికి వచ్చింది. మిర్చి పంట భారీగా పోటెత్తడంతోనే వ్యాపారులు అదునుచూసి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహించారు. ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ కార్యాలయం వైపు వారు దూసుకెళ్లారు. ధరలు ఎందుకు తగ్గిస్తున్నారని వ్యాపారులను, మార్కెట్ అధికారులను సిబ్బందిని నిలదీశారు. వ్యాపారులు కావాలనే ధర తగ్గించి మాయ చేస్తున్నారంటూ ఆందోళన చేశారు. మార్కెట్‌లో సుమారు నాలుగు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మిర్చి ధరల తగ్గుదలపై రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ త్రీ టౌన్ పోలీసులు, డీఎంవో అలీం, మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డితో కలిసి మార్కెట్‌కు హుటాహుటిన చేరుకున్నారు. జెండాపాటను ప్రామాణికంగా తీసుకొని ట్రేడర్లు మిర్చి పంటలను కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు.



రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయితో చర్చిస్తున్న మంత్రి తుమ్మల

రైతుల ఆందోళనపై తుమ్మల ఆరా 6



పాపం.. మద్యం ప్రియులు

- అందుబాటులో లేని రెగ్యూలర్ బ్రాండ్లు
- దుకాణాలకు రేషన్ పద్ధతిలో 50 శాతం పంపిణీ

7

రేపే పల్స్ పోలియో

- ఖమ్మం జిల్లాలో 1,246 కేంద్రాలు
- మొత్తం చిన్నారులు లక్షా 297 మంది

6

నకిలీ పురుగు మందులకు చెక్

- ఇక ఆన్‌లైన్‌లోనే 'పెస్టిసైడ్స్' షాపుల లెసెన్స్‌ల జారీ
- గత ఏడాదే సీడ్స్, ఫర్టిలైజర్స్ వివరాల నమోదు

7

మల్లవరం విద్యార్థికి అమెరికాలో అరుదైన అవకాశం



ఉషస్వీ

తల్లాడ, మార్చి 1: అమెరికాలో ని డల్లాస్ వద్ద యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందే అరుదైన అవకాశం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన విద్యార్థిని రాయల ఉషస్వీకి దక్కింది. స్కూల్ ఆఫ్ ఎకానిమక్ పొలిటికల్ అండ్ పాలసీ సైన్సెస్ పబ్లిక్ అండ్ నో ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ అనే అంశంపై నాలుగేళ్లపాటు పీహెచ్‌డీ చేయాల్సి ఉంది. నాలుగేళ్లపాటు ఉషస్వీకి ప్రతినెలా ఫెలోషిప్ కింద యూనివర్సిటీలోనే అత్యధికంగా 2,200డాలర్ల ఉపకార వేతనం కూడా అందనున్నది. రాయల రామకృష్ణ, లక్ష్మీ దంపతుల కుమార్తె ఉషస్వీ పదోతరగతి వరకు హైదరాబాద్‌లోని త్రివేణి టాలెంట్ స్కూల్, ఇంటర్మీడియేట్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల, డిగ్రీ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, పీజీ పాండిచ్చేరి యూనివర్సిటీలో పూర్తి చేసింది. ఉషస్వీ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో పీహెచ్‌డీ చేయాలనే పట్టుదలతో ఎంట్రన్స్ రాసి ప్రతిభ కనబర్చి ప్రవేశ అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఉషస్వీని పలువురు అభినందించరు.

రేపే పల్స్‌పోలియో



» జిల్లా వ్యాప్తంగా లక్షా297 మంది చిన్నారులు » 1,246 కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి1: జిల్లాలో 3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటితో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్‌తో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేసేందుకు కేంద్రాలను సిద్ధం చేశారు. కాగా రెండేళ్లుగా కరోనా కారణంగా ఒక్కసారే పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడేళ్ల తర్వాత మళ్లీ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లా కేంద్రమైన ఖమ్మంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

జిల్లాలో మొత్తం 5,08,146 నివాసాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,246 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో ఐదేళ్ల లోపు ఉన్న 1,00,297 మంది చిన్నారులకు చుక్కల మందును పంపిణీ చేయనున్నారు. 1,840 మంది అంగన్‌వాడీ, మెప్మా, 1,200 నర్సింగ్ విద్యార్థులు, 1,338 ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది మొత్తం 5వేల మంది సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. బస్టాండు, రైల్వేస్టేషన్ ఆస్పత్రులు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ చిన్నారులకు చుక్కల మందు వేయడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

0-5 ఏళ్లలోపు చిన్నారులు	:	1,00,297
పల్స్‌పోలియో కేంద్రాలు		
నగరాల్లో	:	252
గ్రామాల్లో	:	843
గిరిజన ప్రాంతాలు	:	151
మొబైల్ బృందాలు	:	30
రద్దీ ప్రాంతాల్లో కేంద్రాలు	:	30
కేంద్రాల్లో కేటాయించిన సిబ్బంది	:	4984
రూట్ సూపర్‌వైజర్లు	:	125
మొబైల్‌టీంలు	:	70

అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం

● డాక్టర్ ప్రమీల, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. బస్టాండ్లు, రైల్వేస్టేషన్, రద్దీ ప్రాంతాలు, జనావాసాల్లో పోలియో వ్యాక్సిన్ కేంద్రాలను సిద్ధం చేశాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులను గుర్తించి, వారందరికీ పోలియో చుక్కలను వేయనున్నాం. ఎవరైనా వేయించకపోతే తిరిగి ఇంటింటికీ వెళ్లి మా సిబ్బంది పోలియో చుక్కలు వేసేలా కార్యక్రమాన్ని రూపొందించాం. ప్రతి ఒక్కరూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతానికి సహకరించాలి.

ఖమ్మం మార్కెట్ ఆందోళనపై తుమ్మల ఆరా

ఖమ్మం మార్కెట్, మార్చి 1: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మిర్చి రైతులు ఆందోళన చేయడం పై రాష్ట్ర వ్యావసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. ఈమేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీభాయితో సమావేశం అయ్యారు. తేజ రకం మిర్చి ధరలను వ్యాపారులు ఒక్కసారిగా తగ్గించడంతో రైతులు ధర్నా నిర్వహించిన నేపథ్యంపై చర్చించారు. మార్కెట్‌లో సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఉద్రిక్త పరిస్థితులపై వివరాలు సేకరించారు. దీంతో ఆమె స్పందించి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, పోలీసింగ్ సిబ్బంది సమక్షంలో రైతుల ధర విషయంలో చర్చించి, రైతులకు మార్కెట్‌లో ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా గిట్టుబాటు ధరలు దక్కే విధంగా చూడాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. జిల్లా మార్కెట్ అధికారులు, వ్యాపారులు సమన్వయంతో పని చేసుకోవాలని సూచించినట్లు, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించినట్లు ఆమె తెలిపారు.

దమ్మపేటలో సివిల్ కోర్టు ప్రారంభం నేడు

దమ్మపేట, మార్చి1: దమ్మపేటలో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్‌జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును నేడు ప్రారంభించను న్నట్లు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రామారావు అన్నారు. శుక్రవారం కోర్టు పనులను ఆయన పరిశీ లించి మాట్లాడారు. ఈ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయనతో పాటు హైకోర్టు జడ్జీలు భీమపాక నగేష్, శరత్, కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ కరుణాకర్, ఎస్ఐ సాయికి షోర్‌రెడ్డి, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు ఉన్నారు.

సూరంపల్లిని పరామర్శించిన ఎమ్మెల్యే

కొణిజర్ల, మార్చి1: గుర్తు తెలియ ని వ్యక్తుల చేతిలో తీవ్రంగా గాయపడి ఖమ్మం లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నేత, కొణిజర్ల తాజా, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావును శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ గోసు మధు, వైరా ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, పీసీసీ సభ్యులు నారాయణరావు తదితరులు ఉన్నారు. కాగా సూరంపల్లి రామారావు ఆరోగ్యం కొంతవరకు మెరుగుపడింది. తనపై దాడి చేసిన వారి పేర్లను చెబుతున్నట్లు తెలిసింది. గురువారం రాత్రి పూట ఖమ్మం సీపీ సునిల్‌దత్ కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం సూరంపల్లి రామా రావుపై దాడి జరిగిన ఇంటి ప్రాంతాన్ని పరిశీలించారు. దాడి జరిగిన ప్రదేశాన్ని డాగ్‌స్కాడ్ కూడా పరిశీలించింది. ఈ కేసు విషయంలో దర్యాప్తు కొనసాగుతూనే ఉందని ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సూరంపల్లిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఆరు గ్యారెంటీలు అమలుచేసి తీరుతాం

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముదిగొండ, మార్చి 1: ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని సీతారాంపురం, మేడేపల్లి, గోకినపల్లి, సువర్ణాపురం, ముదిగొండ గ్రామాల్లో రూ.11.25 కోట్ల అభివృద్ధి పనులకు భట్టి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా 58మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కట్టకూరునుంచి సీతారాంపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.20కోట్లు, మేడేపల్లి నుంచి గోకినపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.75కోట్లు, గోకినపల్లి నుంచి కట్టకూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.30కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం జరిగిన సభల్లో భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలీండర్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పేదల కోసం రూ.పదిలక్షలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ముదిగొండలో గృహజ్యోతి పథకాన్ని భట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. ముదిగొండలోని మాలే కృష్ణ ఇంటికి స్వయంగా వెళ్లి మీటర్‌ను స్కాన్ చేసి బిల్లు జనరేట్ చేసి లబ్ధిదారుడు మాలే కృష్ణ భార్య సావిత్రితో 200యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించేవారు ఈనెల నుంచి కరెంట్ బిల్లు చెల్లించాల్సిన పని లేదని, విద్యుత్‌శాఖ వారు మీ ఇళ్లకు వచ్చి జీరో బిల్లు అందజేస్తారని, రూపాయి కూడా కట్టాల్సిన పని లేదని తెలిపారు. పథకం ఎలా ఉంది... సంతోషమేనా అని అడిగి తెలుసుకున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం

ఈ కార్యక్రమాల్లో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్, డీఈవో సోమశేఖరశర్మ, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ పసుపులేటి దుర్గ, ఎంపీడీవో స్వామిరాజు, తహసీల్దార్ వై.రామారావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు బులెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఆదివాసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్‌గా రాంజీ



భట్టు రాంజీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి, మార్చి 1: టీపీసీసీ ఆదివాసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్‌గా కామేపల్లి మండలం గరిడేపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు భట్టు రాంజీ నాయక్‌ను టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ నియమించారు. శుక్రవారం పాతలింగాలలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య భట్టు రాంజీ నాయక్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంజీ సేవలు గుర్తించి పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి, చల్లా మల్లయ్య, రామకృష్ణ, వేణు, రాజేష్, గోపి, సైదులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

» సంతకంతో మద్దతు తెలిపిన తుమ్మల యుగంధర్

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి1: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు భారతరత్నను ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ డిమాండ్ చేశారు. 20 రోజులుగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కేతినేని హరీష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని సంతకాల సేకరణ, పోస్ట్ కార్డు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలుపుతూ రాష్ట్రపతి భవన్‌కి పోస్ట్ కార్డులు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తుమ్మల యుగంధర్ టీడీపీ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలోనే తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారంలో తీసుకొచ్చి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి సంపద సృష్టించిన మహనీయుడు అని అన్నారు. ఎన్టీ రామారావుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు నాగేశ్వరరావు, జక్కంపూడి రామానుజై, గోపి రవి, తదితరులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న తుమ్మల యుగంధర్

ప్రధానోపాధ్యాయురాలిని అడ్డుకోలేదు

● విద్యార్థుల తల్లిదండ్రుల వివరణ



పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తల్లాడ, మార్చి 1: తల్లాడ మండలం అన్నారుగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజిని అడ్డుకోలేదని, ఉద్దేశపూర్వకంగానే మా పేరు వాడారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. మూడు రోజుల క్రితం పదినిమిషాలు ఆలస్యంగా వచ్చిన హెచ్ఎంను బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు గేటు ముందు అడ్డుకున్న ఘటనపై శుక్రవారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ 17 ఏళ్ల నుంచి పాఠశాలలో సరోజిని విధులు నిర్వహిస్తున్నారని, పాఠశాలను తీర్చిదిద్దడంలో ముందుండి, జిల్లాలో పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చి అనేక అవార్డులు సాధించారన్నారు. సెలవు పెట్టడానికి, విద్యార్థుల హాజరు ట్యాబ్ ఇవ్వడానికే వచ్చానని చెపుతున్నప్పటికీ, పట్టించు కోకుండా పాఠశాల లోపలకు రానివ్వకుండా హెచ్ఎంను వెంకటరామారావు అడ్డుకోవడం సరైందికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే ఉపాధ్యాయుల పట్ల ఇలా ప్రవర్తించటం సరైంది కాదని పేర్కొన్నారు. తన రాజకీయ లబ్ధి కోసం గేటు ముందు దళిత ప్రధానోపాధ్యాయురాలిని అడ్డుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆపారని ప్రచారం చేస్తున్నా అక్కడ ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు కూడా ఆసమయంలో లేరని, ఎవరైనా ఉన్నారని నిరూపిస్తే తాము దేనికైనా సిద్ధమని తల్లిదండ్రులు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారెళ్ల మమత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోదావరి తీరం ఇక పావనమే

» కాలుష్య కోరల్లో చిక్కుకున్న కరకట్ట
» రూ.80 లక్షలతో సాగుతున్న డీఆర్‌సీసీ నిర్మాణ పనులు
» నెల రోజుల్లో అందుబాటులోకి శాశ్వత డంపింగ్ యార్డు

భద్రాచలం, మార్చి 1: పోలవరం ముంపు మండలాల పేరుతో ఉమ్మడి జిల్లాలోని ఏడు మండలాలు ఏపీలో విలీనం చేసిన అనంతరం భద్రాద్రి కరకట్టే డంపింగ్ యార్డుగా మారిపోయింది. గత దశాబ్ద కాలంగా కరకట్టపైనే చెత్తను డంపింగ్ చేయడం, తగలబెట్టడంతో ఆ పొగతో ఆ ప్రాంతంలోని కాలనీల వాసులు జీవన్మరణ పోరాటంచేశారు. అనేకమంది శ్వాస కోశ వ్యాధుల బారిన పడ్డారు. ఈ దుస్థితికి ఇక శాశ్వత పరిష్కారం లభించనుంది. మనుబోతుల చెరువు సమీపంలో డంపింగ్ యార్డు పనులు వేగంగా సాగుతుండటం, మరో నెల రోజుల్లో డంపింగ్ యార్డులో చెత్తను డంప్ చేసే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దీంతో గోదావరి నదీ తీరం ఇకపై పావనం కానుంది. పరిసర కాలనీ వాసులకు కష్టాలు తీరనున్నాయి. ఇందుకు భద్రాచలం ఐటీడీఏ పీవో , భద్రాచలం పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రతీక్‌జైన్ తీసుకున్న చొరవే కారణం. రాష్ట్రంలో ఈ రీతిన చెత్తను వేరు చేసి క్రషింగ్ యంత్రాలను ఉపయోగించే వాటిలో తొలి గ్రామ పంచాయతీ భద్రాచలం.

8.5 ఎకరాల్లో.....రూ.80 లక్షలతో పనులు

భద్రాచలంలోని మనుబోతుల చెరువు సమీపంలో 8.5 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 1.5 ఎకరాల్లో డ్రైవేస్ట్ రిసోర్సు కలెక్టింగ్ సెంటర్(డీఆర్‌సీసీ)ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ.80 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు పూర్తయిన అనంతరం పొడి చెత్తను వేరు చేసి క్రష్ చేసే మిషన్‌ను బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారం రూ.70 లక్షలు వెచ్చించి గ్రామ పంచాయతీకి అందజేయనుంది. కాగా తడిచెత్తను క్రష్ చేసే మిషన్‌ను రూ.50 లక్షలతో భద్రాచలం గ్రామ పంచాయతీ కొనుగోలు చేయనుంది. ఇదిలా ఉండగా మిగిలిన ఏడు ఎకరాల్లో భారీగా మొక్కలను పెంచనున్నారు.



నూతనంగా ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు

పీర్జాదిగూడ తరువాత భద్రాద్రే....

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన పీర్జాదిగూడ మున్సిపాల్టీలో ఇదే రీతిన డీఆర్‌సీసీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అక్కడ డంపింగ్ విధానం అమల్లో ఉంది. తాజాగా భద్రాచలం గ్రామ పంచాయతీలో సైతం ఇదే విధానం అధికారులు అమలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

ప్రతి రోజు 15 టన్నుల చెత్త సేకరణ

భద్రాచలం గ్రామ పంచాయతీలో మొత్తం 20 వార్డుల్లో సుమారు 16 వేల ఇళ్ల సముదాయాలుండగా 85 వేల జనాభ ఉంది. 27 వాహనాల ద్వారా ప్రస్తుతం 15 టన్నుల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు నూతన డంపింగ్ యార్డు ప్రారంభం అనంతరం అదనంగా మరో ఐదు వాహనాలను వినియోగించనున్నారు. నూతన డంపింగ్ యార్డు వద్ద పనులు ప్రారంభమైన అనంతరం అందులో పని చేసేందుకు 60 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

వ్యర్థం నుంచి అర్థం.....

నూతనంగా చేపట్టే డంపింగ్ యార్డు ద్వారా భద్రాచలం గ్రామ పంచాయతీకి వ్యర్థం నుంచి అర్థంరానుంది. 24 గంటల్లోనే తడి చెత్తను పొడి చేయడమే కాకుండా పొడరు చేయనున్నారు. దీనిని రైతులు, నర్సరీ నిర్వాహకులు, ఇటుక బట్టీ వారు వినియోగించేందుకు వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తడి చెత్తను క్రష్ చేసే సమయంలో వచ్చే వ్యర్థ నీరుతో ఫర్టిలైజర్స్‌కు సంబంధించిన సంస్థలు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయని వారు పేర్కొంటున్నారు. దీని ద్వారా నెలకు రూ.5 లక్షలు పైన ఆదాయం పంచాయతీకి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఇక్కడ పని చేసేందుకు 60 మందికి అవకాశం లభించనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

బంగారం, నగదు చోరీ

ఏన్కూరు, మార్చి1: మండలంలోని ఇందిరానగర్ కాలనీలో గురువారం రాత్రి ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. సుమారు రూ.3.5లక్షల విలువైన బంగారం దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ కాలనీకి చెందిన కట్టా నాగేశ్వరావు గురువారం రాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం గాజులు, నాలుగు తులాల బంగారం నెక్లెస్ దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాధావత్ రవి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నపురెడ్డిపల్లి: మెడికల్ షాపులో చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని అన్నపురెడ్డిపల్లిలో శుక్రవారం జరిగింది. బాధితుడు ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కీర్త మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ తాళం పగులగొట్టి ఉంది. దుకాణంలో ఉన్న లక్షా 30వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపాడు. సీసీ కెమెరాల్లో వ్యక్తి షాపులో నుంచి కవర్‌తో బయటకు వెల్లడం రికార్డు అయిందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. క్లూస్ టీం సిబ్బంది సంఘటన స్థలంలో వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మధిర రూరల్, మార్చి 1: ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మధిర మండలం దెందుకూరు-ఇల్లెందులపాడు గ్రామాల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర నుంచి టి.రమేష్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే సమయంలో దెందుకూరు నుంచి మధిరకు ద్విచక్రవాహనంపై ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన ఏ.రమేష్, దేసపాటి వినోద్‌లు వస్తుండగా మార్గమధ్యలో ఇల్లెందులపాడు దాటిన తర్వాత కోల్డ్‌స్టోరేజీ సమీపంలో ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 108వాహనం ద్వారా క్షతగాత్రులను మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివాపురానికి చెందిన ఇద్దరిని విజయవాడ, మధిరకు చెందిన యువకుడిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

చికెన్ తినలేదని.. కొడుకును చితకబాదిన తండ్రి

నేలకొండపల్లి, మార్చి1: 9సంవత్సరాల కొడుకును చికెన్ తినమంటే తినలేదని ఆగ్రహంతో తండ్రి బెల్టుతో చితకబాదిన సంఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని అనాసాగరం గ్రామంలో జరిగింది. అనాసాగరం గ్రామానికి చెందిన లింగం మహేశ్వరి, శ్రీనివాస్ దంపతులు కూలి పనులు చేసేవారు. ఈ క్రమంలో వారి కుమారుడు 9సంవత్సరాల మురళి జ్వరం, కామెర్లతో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండగా, మహేశ్వరి కూలీ పనులకు వెళ్లింది. భర్త లింగం శ్రీనివాస్ మూడు రోజుల క్రితం వరంగల్ వెళ్లి శుక్రవారం ఇంటికి వచ్చాడు. ఊరినుంచి చికెన్ కర్రీని తీసుకొని వచ్చాడు. ఇంటి వద్ద ఉన్న కుమారుడు మురళిని చికెన్ తినమని చెప్పాడు. అయితే తనకు జ్వరంగా ఉన్నందున తినలేనని మురళి చెప్పడంతో.. ఎందుకు తినవని కోపంతో బెల్టుతో చితకబాదాడు. తండ్రి శ్రీనివాస్ బెల్టుతో కొట్టటంతో మురళీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై తల్లి మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బిల్లులు ఇవ్వకుండా సతాయిస్తున్న సింగరేణి సంస్థ

» కోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు
» బొగ్గు రవాణాను ఆపేస్తామంటు ఫిర్యాదు
» సీఎం, డిప్యూటీ సీఎం, సింగరేణి ఉన్నతాధికారులకు ఫిర్యాదు

సత్తుపల్లి, మార్చి 1: సింగరేణి సంస్థలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపునకు సంబంధించి బిల్లులు నెలల తరబడి నిలిచిపోవడంతో ఈ విషయం వివాదాస్పదంగా మారుతోంది. దీనిపై బిల్లులు రావాల్సిన వారు అధికారులపై ఆరోపణలకు దిగుతున్నారు. అగ్రిమెంట్ ప్రకారం తమకు రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సి ఉన్నా, నెలల తరబడి చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సింగరేణి సత్తుపల్లి మండలంలోని కిష్టారం ఓసీ నుంచి సైలో బంకర్‌కు బొగ్గు రవాణా చేస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి ఆరోపించారు. ఈ మేరకు సింగరేణి ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు వివరాలు.. సత్తుపల్లి మండలంలోని కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గుగని నుంచి సైలో బంకర్ వరకు బొగ్గు రవాణా చేసేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ క్రమంలో 5.4కిలోమీటర్ల నిర్మించిన రహదారి శిథిలమవ్వడంతో వాహనాలు తిరగటం ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయంగా మట్టి రోడ్డు నుంచి డైవర్షన్ ఇచ్చారని అది 6.3 కిలోమీటర్ల దూరం ఉందని పేర్కొన్నారు. మైలేజి పెరిగిన కారణంగా దానికి కూడా చెల్లింపు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కాని రూ.50లక్షల అదనపు పేమెంట్ ఇవ్వాల్సి ఉన్నా, 11 నెలలుగా నిలిపివేసి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వెనుక ఒక అధికారి పాత్ర ఉందని ఆరోపించారు. దీంతో పాటు యార్డుల్లో బొగ్గు బంకర్లలో పోసేందుకు గాను నాలుగు వాహనాలను ఏర్పాటు చేసుకున్నారని, కొద్ది కాలం తరువాత ప్రైవేటు వాహనాలు యార్డులోకి అనుమతించడంపై సింగరేణి ఉద్యోగుల ఆందోళన కారణంగా ఈ కాంట్రాక్టును అధికారులు నిలిపివేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి వరకు ఉన్న రూ.24 లక్షల బిల్లు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారని దీనిపై కోర్టును ఆశ్రయించగా, కోర్టు బిల్లులు చెల్లించాలని ఆదేశించినా అధికారులు స్పందిచటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కిష్టారం ఓసీ నుంచి సైలో బంకర్‌కు బొగ్గు రవాణా చేసేందుకు మధ్యలో ఉన్న రహదారి కూడా అధ్వానంగా ఉందని, దీని వల్ల వాహనాలు కూడా ధ్వంసమవుతున్నాయని వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే బొగ్గు రవాణాను కూడా ఆపేస్తామని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఫిర్యాదు పేర్కొన్న అధికారి వివరణ కోసం సంప్రదించగా తనపై ఆరోపణలు అవాస్తవమని, బిల్లులు చెల్లించే బాధ్యత తనది కాదని పేర్కొన్నారు.

నవవధువు ఆత్మహత్యాయత్నం

పెనుబల్లి, మార్చి 1: పెళ్లైన రెండునెలలకే నవవధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెనుబల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు శిరీషకు గత జనవరిలో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మాగల్లుకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఇటీవలనే ఇంటికి వచ్చిన శిరీష శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయ అధికారిపై దేవాదాయశాఖకు ఫిర్యాదు

భద్రాచలం మార్చి 1: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన జానకి సదనం నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామంటూ దేవస్థానంలోని ఓ అధికారి తమవద్ద నగదు తీసుకుని మోసం చేశారని ఆరోపిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కు, భద్రాద్రి దేవస్థానం ఈవోకు ట్రస్ట్ సభ్యులు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. జానకి సదనం విషయంలో తమ వద్ద నుంచి దేవస్థానం లోని ఒక అధికారి తమకు సత్రం నిర్మాణ అనుమతులు ఇప్పిస్తామని తమ వద్ద నుంచి రూ. 16లక్షలు తీసుకున్నారని హైదరాబాద్‌కి చెందిన ఒక ట్రస్ట్ సభ్యులు దేవాదాయ శాఖ కమిషనర్ కు, దేవస్థానం ఈఓకు ఫిర్యాదు చేశారు. సదరు అధికారి హైదరాబాద్ కు వచ్చి ఒక అపరిచిత వ్యక్తిని కాంట్రాక్టర్ గా తమకు పరిచయం చేసి, పలు దఫాలుగా రూ.16 లక్షలను తమ వద్ద నుంచి తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాల క్రమంలో స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా 48 గంటలలో నివేదిక సమర్పించాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. అంతర్గత విచారణ చేసిన ఆలయ అధికారులు కలెక్టర్ కు నివేదిక సమర్పించారు. కాగా జానకి సదనం విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవస్థానం ఏఈఓ 1. వి. శ్రవణ్ కుమార్‌ను ఈ విషయంలో వివరణ కోరుతూ భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవిమెమో జారీ చేశారు.

సత్తుపల్లిలో టాస్క్‌ఫోర్స్ దాడులు

సత్తుపల్లిరూరల్, మార్చి1: ఖమ్మం సీపీ సునిల్ దత్ ఆదేశాల మేరకు సత్తుపల్లి మండలంలో అక్రమంగా సాగుతున్న మట్టి తవ్వకాలపై ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మండలంలోని రేజర్ల, కొత్తూరు ప్రాంతాలలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్న ఎక్స్‌కవేటర్ , రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, తోలకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లాకు రూ.9.38కోట్లు ఎంపీల్యాడ్స్ నిధులు మంజూరు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి1: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎంపీల్యాడ్స్ కింద తన నిధులు రూ.9.38కోట్లు మంజూరైనట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎంపీనిధుల నుండి 218పనులకు రూ.9.80 లక్షలకు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటి వరకు 201 పనలకు గాను రూ.9.38కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తం నిధులతో పలు అభివృద్ధి పనుల చేపడతామని, త్వరలోనే పనులకు శంకుస్థాపనలు చేస్తామని నామా పేర్కొన్నారు.

క్రికెట్ విజేత 'మిఠాయి పొట్లం'

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 1: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు ముగిశాయి. టోర్నీ విజేతగా మిఠాయి పొట్లం జట్టు నిలవగా బాలాజీ బ్లాస్టర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో మిటాయి పొట్లాం జట్టు, బాలాజీ బ్లాస్టర్స్ జట్టుపై గెలుపొంది టైటిల్‌ను నిలబెట్టుకుంది. మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన మిఠాయి పొట్లం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన బాలాజీ బ్లాస్టర్స్ జట్టు 8 వికెట్లు నష్టానికి 98 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. పోటీల అనంతరం కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ టోర్నీ విజేతల జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిగా రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.లక్ష నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందచేశారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డివైఎస్‌వో సునిల్‌రెడ్డి, వత్సవాయి రవి, కురువెళ్ల ప్రవీణ్, వేముల వెంకట్, బాణాల లక్ష్మణ్, మతిన్, నరాల నరేష్, శ్రీకాంత్, ఓలేటి సాంబమూర్తి, రంగా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న యుగంధర్, రాజేంద్రప్రసాద్


స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రామయ్యను దర్శించుకున్న 2 లక్షల మంది భక్తులు

» స్వర్ణభద్రకవచాలతో రామయ్య దర్శనం

భద్రాచలం, మార్చి 1: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఫిబ్రవరి నెలలో రెండు లక్షల 122 మంది భక్తులు దర్శించుకున్నారు. అత్యధికంగా 4న 11,009 మంది, అత్యల్పంగా 27న 1627 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం సందర్భంగా రామాలయంలో స్వామి వారు స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

తహసీల్దార్‌ల బదిలీలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి1: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పది మంది తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ కలెక్టర్ ప్రియాంకఅల శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో బూర్గంపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండి ముజాహిద్ ఆళ్లపల్లికి, కరకగూడెం తహసీల్దార్ పి.నాగప్రసాద్ దమ్మపేటకు, అశ్వారావుపేట తహసీల్దార్‌గా పని చేస్తున్న వి.కృష్ణప్రసాద్, బూర్గంపాడుకు, చర్ల తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ అశ్వారావుపేటకు, ఆళ్ళపల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆర్.రమేష్ చర్లకు, కొత్తగూడెం తహసీల్దార్‌గా పని చేస్తున్న డి.పుల్లయ్య టేకులపల్లికి, టేకులపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నాగభవానీ కొత్తగూడెంకు, దమ్మపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.నరేష్ కరకగూడేనికి, చుంచుపల్లి తహసీల్దార్‌గా పని చేస్తున్న పి.కృష్ణ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, కలెక్టరేట్ ఎల్ఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వీవీ శకుంతల చుంచుపల్లికి బదిలీ అయ్యారు.

ఉద్యాన అధికారి మరియన్న బదిలీ



కొత్తగూడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో ఉద్యానవనశాఖాధికారిగా పని చేసిన జినుగు మరియన్న మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. జినుగు మరియన్న స్థానంలో మహబూబాబాద్ జిల్లా ఉద్యానవనశాఖాధికారిగా పని చేస్తున్న కే.సూర్యనారాయణను నియమించారు. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులు వెలువడటంతో వారి వారి స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదు

» నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవు
» పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలి
» సాంకేతికతను ఉపయోగించాలి
» నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. నిషేధిత గంజాయిని రవాణా చేసే వారిపైనే కాకుండా, గంజాయి సేవించే వారిపై కూడా నమోదు చేయాలన్నారు. అసాంఘిఃక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేరసమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా, జూదం లాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిషేదిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతోపాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీస్‌శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరి చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.

అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా విధుల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇ. విజయ్‌బాబు, భద్రాచలం ఎఎస్పీ పరితోష్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు, హాజరైన పోలీస్ అధికారులు

బాధితులకు న్యాయం..

జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఉన్న నగదును పుట్ ఆన్ హోల్డ్‌లో ఉంచామని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఆ నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గ నిర్దేశాలతో బాధితులకు అందజేస్తామని తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో... కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షలు

» రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కొత్తగూడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఇంటర్, పదో తరతి పరీక్షల నిర్వహణ, ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, నెల 19 వరకు ఇంటర్ పరీక్షలు, ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని దీని కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్, పదో తరగతి పరీక్ష కేంద్రాల లోపలికి ఎవరు సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లడానికి వీలు లేదని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టంగా సజావుగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు ఎవరు సెల్ ఫోన్ తీసుకుని రావొద్దని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, జడ్పీ సీఈవో ప్రసూన రాణి, ఇంటర్మీడియట్ అధికారిని సులోచన, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

జాతీయ స్థాయిలో మెరిసిన కేఎంసీ

» తేజల్ సర్వేక్షణ్ ఫలితాల్లో అవార్డు
» తాగునీరు, వ్యర్థజలాల పునర్వియోగంలో సమర్థత
» 5న ఢిల్లీలో అవార్డు అందజేయనున్న రాష్ట్రపతి
» సమష్టి కృషి ఫలితమన్న మేయర్, కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 1: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రకటించిన తేజల్ సర్వేక్షణ్ ఫలితాల్లో ఖమ్మం నగర పాలక సంస్థకు (కేఎంసీ) జాతీయ స్థాయి అవార్డు దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అమృత్ పట్టణాల పరిశీలనలో నాలుగు నగరాలకు అవార్డులు దక్కగా, అందులో ఖమ్మం నగరపాలక సంస్థకు చోటు దక్కడం విశేషం. నగరంలోని జనాభాను ఆధారంగా చేసుకుని ప్రజలకు అందుతున్న తాగునీరు, వ్యర్థజలాల పునర్వినియోగం(ఎఫ్ఎస్‌టీపీ)పై నిర్వహించిన సర్వేలో ఈ అవార్డు లభించింది.

ఖమ్మం నగర పాలక సంస్థలో గతంలో 30వేల మంచినీటి పంపు కనెక్షన్లు ఉండగా మిషన్ భగీరథ పథకం కింద 45వేల పంపు కనెక్షన్లు ఇచ్చారు. వాటిలో 30వేల పంపులకు మీటర్లు ఏర్పాటు చేశారు. రోజు విడిచి రోజు పరిశుభ్రమైన నీటిని రోజుకు రెండు గంటలపాటు ఎటువంటి అంతరాయం లేకుండా అందిస్తున్నారు. కొత్తగా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకయితే తక్షణమే మరమ్మతులు చేస్తూ తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్లు, నీటిని శుద్ధి చేసి సరఫరా చేయడం, నాణ్యత, సెప్టిక్‌ట్యాంక్‌ల శుభ్రత, మురుగునీటి శుద్ధికి చర్యలు తదితర అంశాలను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వచ్చిన సర్వే బృందం పరిశీలించి పనులు సక్రమంగా జరుగుతున్నట్టు సంతృప్తి చెందడంతో ఖమ్మం నగర పాలక సంస్థకు జాతీయస్థాయి అవార్డు లభించింది. ఈనెల 5వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డును అందజేస్తారు.

కాగా, అందరూ సమన్వయంతో పనిచేయడం వల్ల ఖమ్మం నగర పాలక సంస్థకు తేజల్ సర్వేక్షణ్ జాతీయ అవార్డు లభించిందని నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఈ అవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు.

రైతు పోరాటాలకు మద్దతుగా కళారూపాలు

» ప్రజా నాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవేంద్ర


మాట్లాడుతున్న దేవేంద్ర

ఖమ్మం సాంస్కృతికం, మార్చి1: మద్దతు ధరల సాధనకోసం అలుపెరుగని పోరాటాలు సాగిస్తున్న అన్నదాతలకు మద్దతుగా కళారూపాలను నిర్మించాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవేంద్ర పిలుపునిచ్చారు. సుందరయ్యభవన్‌లో శుక్రవారం ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నామా లక్ష్మీనారాయణ అధ్యతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నంపండించే రైతన్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నారని అన్నారు. రైతుల వీరోచిత పోరాటాలను ముందుకు తీసుకుపోయే విధంగా కళా రూపాలను ప్రదర్శించాలన్నారు. కవులు, కళాకారులు, పెద్ద ఎత్తున స్పందించి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్, నాయకులు మారుతి, కొండలరావు, నందిగామకృష్ణ, లింగయ్య, ఉపేందర్ వెంకటేష్, రాయమల్లు, ఆంటోని, చరణ్ పాల్గొన్నారు.

రేపు బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 1: తెలంగాణ బీసీ గురుకులాల్లో 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల ప్రవేశాల కోసం ఈ నెల 3వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి టి. అంజలి తెలిపారు. మెత్తం 11 పరీక్షా కేంద్రాలలో 2573 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రిన్సిపాల్ జాకీరుల్లాకు ‘దుబాయ్’ అవార్డు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 1: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీరుల్లాకు జెనిసిస్ అల్టిమా దుబాయ్ సంస్థ ఇండియన్ సాలిడారిటి కౌన్సిల్‌తో కలిసి ఇంటర్‌నేషనల్ షైనింగ్ అవార్డును ప్రదానం చేశారు. గత వారం దుబాయ్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందించారని జాకీరుల్లా శుక్రవారం తెలిపారు.

నకిలీ పురుగు మందులకు చెక్

» ఇక ఆన్‌లైన్‌లోనే ‘పెస్టిసైడ్స్’ షాపుల లైసెన్స్‌ల జారీ
» గత ఏడాదే సీడ్స్, ఫర్టిలైజర్స్ వివరాల నమోదు
» అక్రమాలు, అవకతవకలకు బ్రేక్ పడే అవకాశం



ఖమ్మం వ్యవసాయం, మార్చి 1: ప్రభుత్వం ఇప్పటికే విత్తనాలు, ఎరువుల లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేయగా, ప్రస్తుతం పురుగు మందుల లైసెన్స్‌లు కూడా ఆన్‌లైన్ చేసే పనిలో పడింది. ఈ చర్యతో నకిలీ కంపెనీల నుంచి రైతులు బయటపడే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో లేని కంపెనీల పురుగు మందులను విక్రయించకుండా కట్టుదిట్టం చేస్తే నకిలీ పురుగు మందులనుంచి తమను కాపాడినట్లవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 930 పెస్టిసైడ్స్ డీలర్ల వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

వివరాలన్నీ ఆన్‌లైన్

రైతులకు సరఫరా అయ్యే విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవి ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాదే సీడ్స్, ఫర్టిలైజర్ల లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేయించింది. దీనితో నకిలీ సీడ్ కంపెనీలు విత్తనాలకు అడ్డుకట్ట పడింది. ఎరువుల దుకాణానికి సదరు ఫర్టిలైజర్ కంపెనీ ‘ఓ’ ఫాం ఉంటేనే విక్రయాలు ప్రారంభమవుతున్నాయి. పెస్టిసైడ్స్ లైసెన్స్‌లను సైతం ఆన్‌లైన్ చేసే క్రమంలో ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. ప్రస్తుతం ఆ పనిని సంబంధిత శాఖ అధికారులు చేపట్టారు. గతంలో పీసీ, ఓ ఫారంలు అమెండ్‌మెంట్ చేయాలంటే దుకాణయజమాని మండల వ్యవసాయాధికారి(ఏవో) దగ్గరకు వెళ్లే వారు. ఈ విధానంతో ఏవోనే దుకాణం వద్దకు వెళ్లి అన్ని పరిశీలించిన తరువాతనే అమెండ్‌మెంట్ చేసే అవకాశం ఉంది.

నకిలీ పీసీలకు చెక్

ఆన్‌లైన్ పెస్టిసైడ్స్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంతో నకిలీ పీసీ(ప్రిన్సిపల్ సర్టిఫికెట్)లకు చెక్ పడనుంది. మ్యానువల్‌గా ఉన్నప్పుడు పురుగుల మందులకు సంబంధించిన పీసీలు కేవలం ఏవో పరిశీలించి అమెండ్‌మెంట్ చేసేవారు. అందులో కొన్ని కంపెనీలు అర్హత లేకున్నా ప్రొడక్టులతో పాటు పీసీలు పెస్టిసైడ్స్ దుకాణాలకు అందించేవారు. దాని అనామత్‌తో స్థానికంగా దుకాణ యజమానులు రైతులకు ఆ కంపెనీ పురుగులమందులను విక్రయించేవారు. ఆన్‌లైన్ కావడంతో అర్హత గల కంపెనీల పీసీలు మాత్రమే తీసుకోనుంది. దీంతో నకిలీ కంపెనీల బండారం బయటపడనుంది.

ఇక అన్ని వివరాలు ఆన్‌లైన్‌లోనే..



రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్ల వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాల్సిందే. దుకాణానికి పురుగుల మందులు విక్రయించేందుకు లైసెన్స్ ఉందా.. లేదా ?, దుకాణ యజమాని వివరాలు, దుకాణం ఎక్కడ ఉంది, గోదాం ఉంటే దాని వివరాలు, దుకాణం నడిపే వారి వివరాలు, దుకాణంలో విక్రయిస్తున్న పురుగు మందుల కంపెనీల నుంచి ఇచ్చిన పీసీల వివరాలు, లైసెన్స్ వివరాలను మండల వ్యవసాయాధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారు.

ఎం. విజయనిర్మల, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి

పాపం.. మద్యం ప్రియులు..

» అందుబాటులో లేని రెగ్యూలర్ బ్రాండ్లు
» దుకాణాలకు రేషన్ పద్ధతిలో 50శాతం పంపిణీ
» రెండు నెలలుగా అమ్మకాలపై ప్రభావం
» నాటు సారాయి దిశగా పలువురు..



ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధారణ మద్యం ప్రియులకు ఇష్టమైన బ్రాండ్ల కొరత తీవ్రమైంది. రెగ్యూలర్‌గా లక్షల కొద్దీ మద్యం కేసుల అమ్మకాలు జరిగే బ్రాండ్లు రెండు నెలల నుంచి మాయమయ్యాయి. దీంతో మద్యం ప్రియలకు కిక్కు ఎక్కటం లేదు. మద్యం దుకాణాల్లో అమ్మకాలు సైతం 50శాతానికి పైగా పడిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలోని మద్యం ప్రియులు నాటు సారాయి దిశగా అడుగులు వేస్తున్నారు. మళ్లీ గుడుంబా బట్టీలు వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 210 వైన్స్, 50 బార్లు, 3 క్లబ్బులు ఉన్నాయి. వీటికి వైరా మద్యం డిపో నుంచి బ్రాంది, వైన్, బీరు పంపిణీ జరుగుతుంది. రాష్ట్రంలోనే ఇతర జిల్లాలకు భిన్నంగా కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్ల సేల్స్ ఎక్కువగా ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా ఓఏబీ, ఎంహెచ్, చీప్ లిక్కర్, ఐబీ, ఎంసీ, ఓసీ అమ్మకాలు జరుగుతాయి. నెలకు ఓఏబీ లక్ష 20వేల కేసులు అమ్మకాలు జరుగుతాయి. గత రెండు నెలలుగా వైరా మద్యం డిపోకు 60వేల నుంచి 70వేల కేసులు మాత్రమే సప్లయ్ జరుగుతోంది. ఓఏబీతో పాటుగా ఎంహెచ్ 30వేల కేసులు, ఛీప్ లిక్కర్ 30వేల కేసులు, ఐబీ 25వేల కేసులు, ఎంసీ 20వేల కేసులు, ఓసీ 10వేల కేసులు మాత్రమే ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాలకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ నుంచి కేటాయింపులు జరుగుతున్నాయి. ఒక్కో మద్యం దుకాణానికి రోజుకు 100 కేసులు బీర్లు కావాలంటే కేవలం 20 నుంచి 30కేసులు మాత్రమే అందిస్తున్నారు. జనవరిలో జరిగిన అమ్మకాల్లో కేవలం 50శాతం మాత్రమే ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాలకు మద్యం సరఫరా జరుగుతోంది.

ఓఏబీ మద్యం బాటిల్ ధర రూ.140 ఉంటుంది. రెగ్యూలర్‌గా ఓఏబీ తీసుకునే వారు ఒక బాటిల్‌తో ఒకటి నుంచి రెండు రోజులు మద్యం సేవిస్తారు. కానీ మద్యం దుకాణాల్లో ఓఏబీ అందుబాటులో లేక పోవటంతో రూ.200కు పైగా డబ్బులు పెట్టి ఒకే రోజు మద్యం సేవించినా నచ్చడం లేదని మందు బాబులు అంటున్నారు. ఎంహెచ్ బాటిల్ ధర రూ.180 ఉండగా రెగ్యూలర్‌గా తీసుకునే వారు, ఆ మద్యం కోసం అడుగుతున్నారు. ఇక రూ.110కే అందుబాటులో ఉండే చీప్ లిక్కర్ లేక సారాయి కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

డిపో చుట్టూ మద్యం వ్యాపారులు

గత ప్రభుత్వంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు మద్యం వ్యాపారులకు దుకాణాల వారీగా టార్గెట్‌లు ఇచ్చి లక్ష్యానికి మించి అమ్మకాలు జరిపించారు. మద్యం దుకాణం వ్యాపారికి కోరిన మేరకు స్టాక్ అందిస్తే వారం రోజుల వరకు డిపో వైపు రారు. కానీ ఇప్పుడు పరిస్థితి విరుద్ధంగా ఉంది. 100 బీరు కేసులు కావాలంటే కేవలం 20కేసులు అందిస్తున్నారు. జనవరి నెలలో ఇచ్చిన స్టాక్‌లో 50శాతం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. దీంతో ఈ రోజు తెచ్చిన స్టాక్ మరుసటి రోజు సాయంత్రానికి పూర్తవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 263 మద్యం షాపులు ఉండగా వాటిలో ప్రతి రోజు 200 మంది వ్యాపారులు వైరా మద్యం డిపోకు వచ్చి రేషన్ విధానంలో మద్యం తీసుకెళ్తున్నారు.

కేటాయింపులు జరగటం లేదు..

నాగేంద్రరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఖమ్మం జిల్లా



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓఏబీ, ఎంహెచ్,ఐబీ, ఎంసీ, ఓసీ, చీప్ లిక్కర్‌కు గిరాకీ ఉంటుంది. కొన్ని సమస్యల కారణంగా ఆయా బ్రాండ్లు వైరా డిపోకు రావటం లేదు. దీంతో మద్యం అమ్మకాలు తగ్గాయి. సమస్యను రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

వేతన భారం..

» వైరాకు మంజూరు కాని కమిషనర్ పోస్టు
» బాధ్యతలకు ఆసక్తి చూపని మేనేజర్
» ఇతర అధికారులు వస్తే మునిసిపాలిటీ కి ఆర్థిక నష్టం



» 010 పద్దు నుంచి వేతనాలకు లేని అవకాశం » సాధారణ నిధుల నుంచే చెల్లింపులు

వైరా, మార్చి 1: వైరా మునిసిపాలిటీగా స్థాయి పెరిగినా కమిషనర్ పోస్టు మంజూరు లేక పోవడంతో వేతన భారం పడుతోంది. ఇతర ప్రాంతాల నుంచి అధికారులు వస్తే వారికి 010 పద్దు ద్వారా చెల్లించే అవకాశం లేదు. దీంతో సాధారణ నిధుల నుంచి సదరు అధికారి వేతనం, పర్యటనల కు ఉపయోగించే కారు ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఫలితంగా మునిసిపాలిటీ నష్టపోతోంది.

2018 ఆగస్టులో వైరా మునిసిపాలిటీ ఏర్పడింది. ఇంతవరకు మునిసిపాలిటీకి కమిషనర్ పోస్టు మంజూరు లేదు. మొదట ఖమ్మం నగర కార్పొరేషన్‌కు చెందిన అధికారులు ఇక్కడ విధులు నిర్వహించారు. ఆతర్వాత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీఈలు, ఏఈలు కమిషనర్ బాధ్యతలు నిర్వహించారు. వారు ఇతర శాఖలకు చెందిన అధికారులు కావడంతో ప్రభుత్వ పద్దు నుంచే రెగ్యూలర్ వేతనాలు తీసుకున్నారు. మునిసిపాలిటీపై ఎలాంటి ఆర్థికభారం పడలేదు.


2022 ఫిబ్రవరి నుంచి..

2022 ఫిబ్రవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు 12నెలల కాలానికి మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఎన్.వెంకటస్వామికి వేతనం చెల్లించారు. అలాగే కారు అద్దె కూడా చెల్లించారు. ఈ చెల్లింపులు మొత్తం రూ.15లక్షలకుపైగానే జరిగింది. మణుగూర్ మునిసిపాలిటీలో రెగ్యూలర్ కమిషనర్‌గా ఉన్న వెంకటస్వామిని పోస్టు లేని వైరాలో నియమించడంతో 010పద్దు నుంచి నేరుగా వేతనం పొందే అవకాశం లేకపోవడంతో మునిసిపల్ సాధారణ నిధుల నుంచి ఆయనకు 12నెలల కాలం వేతనం చెల్లించారు. అలాగే 2023 జూన్ నుంచి నవంబరు వరకు దాదాపు ఆరునెలల కాలం కమిషనర్‌గా విధులు నిర్వహించిన పతాని వెంకటేశ్వర్లుకు కూడా మునిసిపల్ సాధారణ నిధుల నుంచే వేతనం, కారు అద్దె చెల్లించారు. ఆయన సూర్యాపేట మునిసిపాలిటీ నుంచి వైరాకు వచ్చి కమిషనర్ బాధ్యతలు నిర్వహించారు.

మేనేజర్ రమాదేవి కొనసాగి ఉంటే...

వైరా మునిసిపాలిటీలో మేనేజర్‌గా ఆర్.రమాదేవి ఉన్నారు. ఈ మునిసిపాలిటీ స్థాయి మేనేజర్ పోస్టు వరకే ఉంది. అయితే మేనేజర్ అయిన రమాదేవి మునిసిపల్ కమిషనర్ విధులు నిర్వహించే అవకాశముంది. అప్పుడు మునిసిపాలిటీపై వేతనం భారం కూడా ఉండేది కాదు. కానీ ఆమె ఇక్కడ కమిషనర్‌గా పనిచేసేందుకు మాత్రం సుముఖత చూపించలేదు. జోన్ల వారీగా జరిగిన బదిలీల్లో భాగంగా జీవో 317కింద 2022 మొదట్లో రమాదేవి జనగామ నుంచి వైరా మునిసిపాలిటీకి మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. జనగామలో ఉన్నప్పుడే ఆమె డిప్యూటేషన్‌పై మధిర మునిసిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతల్లో ఉన్నారు. జనగామ నుంచి వైరా మేనేజర్‌గా బదిలీ అయిన తర్వాత కూడా ఆమె మధిర కమిషనర్‌గానే కొనసాగారు.

వైరాలో తరచూ అనేక వివాదాలు చోటుచేసుకొని కమిషనర్ బాధ్యతలు నిర్వహించేవారు మారారు. ఆసమయంలో కూడా వైరాలో మేనేజర్‌గా వేతనం తీసుకుంటున్న ఆమెను వైరాకు తీసుకురాలేదు. అక్కడ మూడేళ్ల కాలం ముగియడంతో ఇటీవల రమాదేవిని కోదాడ మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు. కోదాడ పంపించకుండా వైరాకు తీసుకువచ్చి ఆమెకు కమిషనర్ బాధ్యతలు అప్పగిస్తే వేతన భారం తప్పేది. ఆమెను కోదాడకు పంపించటంతో విధిలేని పరిస్థితుల్లో జీహెచ్ఎంసీలోని ఓ ప్రాంతంలో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సీహెచ్.వేణును వైరా మునిసిపల్ కమిషనర్ బాధ్యతల్లో నియమించారు. ఆయన వేతనం, కారు అద్దె, ఇతర సౌకర్యాలలకు సాధారణ నిధుల నుంచి భరించాల్సి ఉంటుంది.



హోటల్‌లో ఆహారశాఖ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 1: ఖమ్మంలోని భోజన హోటల్‌లో ఆహారం బాగాలేదని ఓ ఫిర్యాదుదారుడు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు పోస్టు కార్డు ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే ఆయా రెస్టారెంట్‌పై ఆకస్మిక తనిఖీ చేయాలని జిల్లా ఆహార నాణ్యతా ప్రమాణాల శాఖ గెజిటెడ్ అధికారి కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఖమ్మంలోని పాతబస్టాండ్ సెంటర్‌లోని ఓ రెస్టారెంట్‌ను ఆహారతనిఖీ అధికారులు తనిఖీ చేశారు. భోజనంతో పాటుగా కారం ఇతర పదార్థాల రెండు శ్యాంపిల్స్‌ను సేకరించారు. ఆహార తనిఖీ అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆహారం, పాలు, స్వీట్లు, ఇతర పదార్థాలు ఎక్కడైనా కల్తీ జరిగితే 91211 63567 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

‘ధరణి’ సమస్యలు పరిష్కరించాలి

» అధికారులకు తహసీల్దార్ల ఆదేశం



బోనకల్, కామేపల్లి మండలాల్లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

నేలకొండపల్లి/బోనకల్/కామేపల్లి మార్చి1: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ గౌరీశంకర్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ధరణి సమస్యలపై గతంలోనే వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈనెల 9లోపు పూర్తి చేయాలన్నారు. గ్రీవియన్స్ ల్యాండ్ మ్యాటర్స్(జీఎల్ఎం), ట్రాన్సాక్షన్ మాడ్యూల్(టీఎం-33)లను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి గాను మూడు టీంలను ఏర్పాటు చేశారు. డీటీ ఇమ్రాన్, ఎమ్మార్‌ఐలు ఆలస్యం మధుసూదనరావు, మాధవిలతో ఏర్పాటు చేసిన టీంలు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తాయని తహసీల్దార్ గౌరీశంకర్ సమావేశంలో చెప్పారు. ప్రతి ఒక్కరూ టీంలకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎర్రయ్య, వ్యసాయాధికారి అరుణ, డీటీ ఇమ్రా న్, ఎమ్మార్‌ఐలు మధుసూదనరావు, మాధవి, ఎంపీఓ శివతో పాటుగా ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల విచారణ

బోనకల్: మండలంలోని మోటమర్రి, బోనకల్ గ్రామాల్లో ధరణి భూ సమస్యలను పరిష్కరించేందుకు గానూ శుక్రవారం రెవెన్యూ అధికారులు రైతుల పొలాలకు వెళ్లి విచారణ నిర్వహించారు. మండలంలో మొత్తం 324 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. అత్యధికంగా టీఎం-33 మాడ్యుల్ కింద 256 దరఖాస్తులు, జీఎల్ఎం కింద 30, నిషేధిత జాబిత కింద 16, సక్సేషన్ కింద 8, మ్యూటేషన్ కింద 8, ఖాతా మెర్జింగ్ కింద 6 దరఖాస్తులు ఉన్నాయి. అత్యధికంగా పేర్ల మార్పులు, చేర్పులు, విస్తీర్ణపు హెచ్చు తగ్గులు, గతంలో పాసుబుక్‌లో నమోదైన భూమికి సంబందించి కొత్త పాసు పుస్తకంలో ఎక్కక పోవడం లాంటి సమస్యల గురించి విచారణ చేశారు. మండలంలో అత్యధికంగా లక్ష్మీపురం రెవెన్యూ పరిదిలో 52 పెండింగ్ దరఖాస్తులు ఉండగా, తక్కువగా రామాపురంలో మూడు దరఖాస్తులు మాత్రమే ఉన్నాయి. ఆర్ఐలు లక్ష్మణ్, రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మీ ఆద్వర్యంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు 3 బృందాలు పని చేస్తున్నాయి. తహసీల్దార్ పున్నం చందర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

కామేపల్లి: ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు కామేపల్లిలో మూ డు టీంలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ధరణిలో దరఖాస్తు చేసుకున్న రైతుల భూములను క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బీ శంకర్ ఏఈఓ శ్రీకన్య, పెండ్ర అనిల్‌కుమార్, పార్వతి, ఈసాక్ పెసా మొబలైజర్ ముక్తి సాంబశివరావు రైతులు భాస్కర్ నాయక్ అమిరినేని వెంకటేశ్వర్లు, కంపసాటి అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట వినోభా నవోదయ కాలనీ వాసుల ధర్నా



ఆందోళన చేస్తున్న మహిళలు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి 1: ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూలో భూదాన యజ్ఞ బోర్డు ఇచ్చిన స్థలంలో నివాసం ఉంటున్న మాకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో వినోభా నవోదయ కాలనీకి చెందిన మహిళలు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఖాళీబిందెలతో ధర్నా నిర్వహించారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య, సహాయ కార్యదర్శి పోలెబోయిన ముత్తయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య మాట్లాడుతూ పేదలు వెలుగుమట్ల సర్వేనెంబర్ 147, 148, 149లో నివసిస్తున్నారన్నారు. అయితే అక్కడ కాలనీవాసులకు తాగునీరు, విద్యుత్, రహదారి సౌకర్యం కలిగించాలని అధికారులకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవటం లేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఓపీడీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల లక్ష్మణాచారి, గ్రామీణ పేదలసంఘం జిల్లా కార్యదర్శి కల్తి రామచంద్రయ్య, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లూరి కృష్ణ, ప్రజాతంత్ర విద్యార్థిసంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, ఇళ్లస్థలాల కమిటీ లద్యక్షుడు జంగం రామచంద్రయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 1: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవి బాబు తెలిపారు.మెత్తం 70 పరీక్షా కేంద్రాలలో మెదటి సంవత్సరం మెదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష పేపర్ 1 జనరల్ విద్యార్థులు 16,563 మందికి 15,989 మంది, హజరై 574 మంది పరీక్షకు హజరుకాలేదు, ఓకేషనల్ విద్యార్థులు 2570 మందికి 2295 మంది హజరుకాగా, 275 మంది పరీక్షకు హజరుకాలేదని డిఐఈఓ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ నగరంలోని నయబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని పర్యీలించి పరిక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. 38 పరీక్షా కేంద్రాలను సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించారు.

‘కోటిలింగాల’ జాతర ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

» భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

» అధికారులకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశం



కోటిలింగాల ఆలయంలో ఎమ్మెల్యే

కారేపల్లి మార్చి 1: మహాశివరాత్రి సందర్భంగా పోలంపల్లి పంచాయతీ పరిధిలోని కోటి లింగాలలో నిర్వహించే జాతరకు ఏర్పాట్లు ఘనంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న జాతరకు అవసరమైన ఏర్పాట్లును పూర్తిచేయాలని ఎమ్మెల్యే రాందాసునాయక్ అధికారులకు సూచించారు. కోటిలింగాల వద్ద ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడురోజులపాటు జరగనున్న జాతరకు వేలాది మంది ప్రజలు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని భక్తులకు అవసరమైన విద్యుత్, తాగునీటి సమస్య, స్నానాలకు నీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

బీటీ, సీసీ పనులకు శంకుస్థాపన

మండల పరిధిలోని భాగ్యనగర్, విశ్వనాధపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేయనున్న బీటీ, సీసీ రోడ్లు పనులకు శుక్రవారం మ్మెల్యే మాలోత్ రాందాసునాయక్ శంకుస్థాపన చేశారు. విశ్వనాధపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంనుంచి బుగ్గవాగు చెక్‌డ్యాం వరకు, ఇదే ఆలయం నుంచి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వరకు రూ.2కోట్లకుపైగా వ్యయంతో బిటి రోడ్లుపనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే బాగ్యనగర్‌తండాలో రూ.15లక్షల రూపాయలతో ఏర్పాటుచేయనున్న సీసీ రోడ్డుపనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శకుంతల, జడ్పీటీసీ జగన్, సొసైటీ ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరిబాయి, ఆజేయ్‌బాబు, బాణోత్ రాంమూర్తి, తలారిచంద్రప్రకాష్, పగడాల మంజుల, విష్ణువర్ధన్ రెడ్డి, తోటకూరి రాంబాబు, సురేందర్ మనియర్ దమ్మలపాటి రాంబాబు తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేష్‌కుమార్, భద్రునాయక్ తదిదరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే రాందాసునాయక్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 4పథకాలను అమలుచేసిన్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు: సీపీ



నగర మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, మార్చి 1: ఖమ్మం నగర పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. నగరంలో ట్రాఫిక్ పరిస్థితిపై సీపీ శుక్రవారం తన కార్యాలయలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీపీకి ట్రాఫిక్ గురించి వివరించారు. సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కారానికి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీర్ఘకాలిక చర్యలకు ఉపక్రమిస్తే వాహనదారులకు కొంతమేర ఊరట కలుగుతుందని, ఆదిశగా అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తీవ్రగా ఉన్న ప్రాంతాల్లో విజుబల్ పోలీసింగ్ సమర్థంతా అమలు చేయడమంతో పాటు వాహనదారులకు ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

నేలకొండపల్లిమార్చి1: ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కోరారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్‌పోలియో నిర్వహణకు రెండు రూట్లు, ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 0నుంచి5సంవత్సరాల లోపు పిల్లలు 1972 మందిని గుర్తించామన్నారు. ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తామన్నారు. సోమ, మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు ప్రతి ఇంటిని సందర్శించి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలను వేస్తారని డాక్టర్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగులు సహకరించాలని కోరారు.

రైతులపై దాడి దుర్మార్గం: ప్రజాపంథా

తిరుమలాయపాలెం, మార్చి1: కనీస మద్దతు ధర కలిపించాలని రైతులు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే వారిపై పోలీసులు దాడులు చేయడం దుర్మార్గమని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లానాయకులు పుసులూరి నరేందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టెలపాడులో ఆపార్టీ కార్యకర్తల సజమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులపై పోలీసులు దాడిని అన్నివర్గాల ప్రజలు ఖండించాలన్నారు. ఢిల్లీ సరిహద్దులో రైతులు ఈనెల 21న చేపట్టిన ధర్నాలో రైతాంగంపై పోలీసుయంత్రాంగం జరిపిన దాడిలో అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయిని, తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పి.మంజుల, నాయకులు పుసులూరి గిరి, గొడుగు విజయ్, ముత్తమ్మ, ఎంపీటీసీ నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం, మార్చి 1: మహిళలు స్వయం సమృద్ధి సాధించి అన్ని రంగాల్లో ముందుండాలని ఏపీఎం అలివేలుమంగ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో నాబార్డు సహకారంతో స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద హ్యాండ్ ఎంబ్రాయిడరి, కుట్టు, అల్లికలపై 15రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని , వీటిని మహిళలు సద్వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ కాలానికి రూ.50చొప్పున అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గౌస్‌మియా, సీసీలు బి.నాగేశ్వరరావు, రవి, జయపాల్, సావిత్రి, అనిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

‘మాస్‌లైన్ మహాసభను విజయవంతం చేయండి’



తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇఫ్టూ

తల్లాడ/తిరుమలాయపాలెం మార్చి 1: ఖమ్మంలో ఆదివారం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు జరిగే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మాస్‌లైన్ కల్లూరు డివిజన్ కార్యదర్శి ఏ.వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకుడు షేక్.లాల్‌మియా, ఐఎఫ్‌టీయూ నాయకులు దారావత్ శ్రీనివాసరావు, కె.వెంకటేష్, నాగులు, రాజారత్నం, నాగేశ్వరరావు, ఖాజామియా, రాము పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ జనరల్‌బాడీ సమావేశం శుక్రవారం జరిగింది. నాయకులు బండెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ , ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించేందుకు విప్లవ పార్టీలు ఐక్య పోరాటాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామి, వై.నవీన్, పుసులూరి గిరి, జి.సరోజన, వి.శ్రీను, కొత్తపల్లి వెంకటరెడ్డి, గొడుగు విజయ్ పాల్గొన్నారు.

కిష్టారంలో వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్, మార్చి1: కిష్టారం ఓసీ ప్రభావిత ప్రాంతమైన మండలంలోని చెరుకుపల్లిలో శుక్రవారం సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి ప్రభావితప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలందిస్తూ మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు పీవో ఎంవీ.నరసింహారావు తెలిపారు. శిబిరంలో వైద్యులు డీ.శిరీష రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇరపా లలిత, సంక్షేమాధికారి సందీప్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

సత్తుపల్లిరూరల్, మార్చి1: పది పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలని శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ కుసుమకుమారి కోరారు. యువసేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో జాన్, జొన్నలగడ్డ రాజు, కేశవరెడ్డి, దుర్గాప్రసాద్, వెంకీ, శ్యామ్, రవితేజ, దుర్గాచలం, దుర్గాప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.

‘అమరవీరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ’

తల్లాడ, మార్చి 1: అమరవీరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందుకోబోతున్నామని ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇసన్నపల్లి అశోక్‌మాదిగ అన్నారు. శుక్రవారం తల్లాడలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు ఆదూరి రవి, ఆదూరి బాలకృష్ణ, సుధాకర్, రాము, మిమిక్రీ బాబు, మధు, నర్సింహారావు, ఉపేందర్ పాల్గొన్నారు.

సూరంపల్లిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

» పోలీసుస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తంచేసిన కొణిజర్ల గ్రామస్థులు, కార్యకర్తలు



ఆందోళన చేస్తున్న కొణిజర్ల గ్రామస్థులు

కొణిజర్ల,మార్చి1: కొణిజర్ల తాజా, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత సూరంపల్లి రామారావుపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని శుక్రవారం కొణిజర్ల గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సీఐ సాగర్, ఎస్ఐ శంకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని సీఐ, ఎస్ఐ హామీ ఇచ్చారు.

మహిళల పూజలు

సూరంపల్లి రామారావు త్వరగా కోలుకోవాలని కోరుతూ గ్రామంలోని రామాలయంలో కొంతమంది మహిళలు శుక్రవారం పూజలు చేశారు. రామారావు పూర్తిగా ఆరోగ్యంగా కోలుకొని ఇంటికిరావాలని వారు ఆకాంక్షించారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

» యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుల్‌మీరా

మధిర, మార్చి 1: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుల్‌మీరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం మధిర ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని, ఈ కుబేర్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే జమచేయాలని, నూతన విద్యావిధానంలోని అసంబద్ధ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో కన్వీనర్ రావిరాల లక్ష్మణరావు, ఏ వినోదరావు, వీరయ్య, కస్తూరీబాయి, ఇబ్రహీం, చెన్నయ్య, రాణి, లాల్ అహ్మద్, సాదు సమాదానం, బాస్కర్‌రావు, కొండలరావు పాల్గొన్నారు.

కార్మికచట్టాల్ని కుదించే ఆలోచనను విరమించుకోవాలి

పెనుబల్లి, మార్చి 1: కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్‌ల కుదింపు ఆలోచనను విరమించుకోవాలని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం లంకపల్లి ఏరియా భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు సీప్లస్ 50శాతం పంటల సేకరణ తీసుకురావాలని, రైతులకు రుణవిముక్తి కల్పించాలని, రుణమాఫీ చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు గుడిమెట్ల బాబు, షేక్.రాజీ, హరి, నాగేశ్వరరావు, గుండ్రు వెంకటేశ్వరరావు, పి.శేషగిరి, పరకాల ఆనందరావు, తడికమళ్ల చిరంజీవి, మిట్టపల్లి నాగమణి, కొర్రయ్య పాల్గొన్నారు.

మిర్చిధర తగ్గుదలపై చర్యలు తీసుకోవాలి

వైరా, మార్చి 1: ఖమ్మం మిర్చి మార్కెట్లో ధరల తగ్గుదలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కెట్లో మిర్చి జెండా పాట తక్కువగా ఉండమేకాక జెండాపాట ధరకు కొనుగోలుకు మధ్య రూ.ఐదారువేలు వ్యత్యాసం ఉందని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయశాఖ మంత్రి, కలెక్టర్ ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి అధికారులు, వ్యాపారులకు సూచనలు చేసినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదని, మార్కెట్ ధరల తగ్గుదలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎలక్ట్రికల్ పనిలో రక్షణ చర్యలు తీసుకోండి

● కేకేఆర్ ఫౌండేషన్ శిక్షకుడు కృష్ణారెడ్డి

నేలకొండపల్లి, మార్చి1: ఎలక్ట్రికల్ పని చేసే సమయంలో తప్పనిసరిగి రక్షణ చర్యలు తీసుకోవాలని కేకేఆర్ ఫౌండేషన్ శిక్షకుడు కృష్ణారెడ్డి అన్నారు. నేలకొండపల్లి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సంఘం ఆద్వర్యంలో శుక్రవారం నేలకొండపల్లిలో 30 మంది ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు వివిధ అంశాలల్లో శిక్షణ ఇచ్చారు. ఎలక్ట్రీషియన్లు ముఖ్యంగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు పని చేసే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీసం శ్రీనివాసరావు, చిట్టా సైదారెడ్డి, షేక్.మజీద్, మదార్‌సాహెబ్, దేవరపల్లి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న కృష్ణారెడ్డి

పండితాపురం మినీ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, మార్చి 1: కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో సమ్మక్క సారలమ్మ మినీ జాతర మూడు రోజులలో భాగంగా చివరి రోజు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, గబ్రూనాయక్, మహేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, నర్సింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్సు వితరణ



ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్న దాతలు

వైరా, మార్చి 1: వైరా మండలం రెబ్బవరం గ్రామపంచాయతీకి తాళ్లూరి శేషయ్య జ్ఞాపకార్థం మనుమరాళ్లు, మనుమడు ఫ్రీజర్ బాక్సును వితరణగా అందజేశారు. శుక్రవారం రూ.లక్ష విలువైన ఫ్రీజర్ బాక్సును పంచాయతీ కార్యదర్శి బండా వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో దాతలు తాళ్లూరి నాగమణి, కృష్ణ, కమలశ్రీ, వెంకటయ్య, నాగేశ్వరరావు, ఆకుల రమేష్, వల్లభి శ్రీను, షేక్.ఖాదర్, గూడపాటి సూర్యం పాల్గొన్నారు.

నేడు వైరా మండలంలో ఎమ్మెల్యే పర్యటన

వైరా, మార్చి 1: వైరా మండలంలో శనివారం ఉదయం నుంచి వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, స్నానాల లక్ష్మీపురంలో మహాశివరాత్రి వేడుకలపై సమీక్ష సమావేశం, వైరా మునిసిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఇండియా కూటమితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ: సీపీఐ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 1: బీజేపీ మతోన్మాద విధానాలతో దేశంలో ఆరాచకశక్తులు పెరుగుతూ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని, ప్రస్తుత పరిస్థితిలో ఇండియా కూటమితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమైతుందని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గిరిప్రసాద్‌భవన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. నాయకులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, చామకూరి వెంకటనారాయణ, యానాలి సాంబశివారెడ్డి, నూనే శశిదర్, గాదె లక్ష్మీనారాయణ, సైదా, తాటి నిర్మల పాల్గొన్నారు.

కరుణగిరిలో ఆధ్యాత్మిక వైభవం

ఖమ్మం రూరల్, మార్చి 1: మండల పరిదిలోని కరుణగిరిలో ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. కరుణగిరి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం మత గురువులు పసుపులేటి యుగల్‌కుమార్, కరుణగిరి డైరెక్టర్ మాథ్యూ వరప్రసాద్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలను వినిపించారు. జీవితంలో ఎదురైయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, వాటిని ఎలా ఎదుర్కోవాలని అవగాహన కల్పించారు. క్రైస్తవ సోదరులంతా భక్తిశ్రద్ధలతో ఏసుక్రీస్తును స్మరిస్తు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణగిరి పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పాటలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మత గురువులు కొమ్ము నవీన్, రాజు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి అవకాశాలు

మధిర, మార్చి 1: బ్యూటీషియన్ కోర్సుతో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఈ కోర్సుపై అవగాహన కలిగి వుండాలని ప్రముఖ బ్యూటీషియన్ మాధవి సూచించారు. శుక్రవారం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఉద్యోగాన్వేషనలో ఉంటూ కూడా ఈకోర్సుతో ఉపాధి పొందేందుకు అవకాశం ఉందన్నారు. త్రెడ్డింగ్, ఫేషియల్ మసాజ్, హెయిర్ కేర్ రొటీన్, టాన్ రిమూనింగ్, మేకప్ స్టెప్స్ తదితర విషయాలను విద్యార్థినిలకు నేర్పించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో ఆర్డినేటర్ డా.ఎస్ ఇందిర, అర్థశాస్త్ర అధ్యాపకులు పీ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్/ఖమ్మం రూరల్, మార్చి1: మండలంలోని గౌరిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శరత్‌బాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, కిన్లే ఫ్యాక్టరీ ఏరియా, రాజవ్‌నగర్ ప్రాంతాలలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖమ్మం రూరల్: మండలంలో ఏదులాపురం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిదిలో మరమ్మతులు కారణంగా సబ్‌స్టేషన్ పరిదిలోని గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామ పంచాయతీలలో ఆయా పంచాయతీల పారిశ్రామిక ఏరియాలో కూడా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ క్రాంతిసింహ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏజెన్సీ ఉద్యోగాలు గిరిజనులకు కేటాయించాలి

కామేపల్లి, మార్చి 1: ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ నియామకాల్లో స్థానిక గిరిజన అభ్యర్థులకు కేటాయించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉపాధ్యాయల పోస్టులను ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ద్వారా స్థానిక గిరిజనులచే నియామకాలు జరగాలని డిమాండ్ చేశారు.

నేరుగా రూ.500 గ్యాస్ పథకం అమలు చేయాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 1: ప్రభుత్వాలు మోసం చేసిన విదంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసానికి గురి చేయవద్దని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు తాటి నిర్మల కోరారు. శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల హామి మేరకు మహిళలకు రూ.500లకే నేరుగా గ్యాస్ పంపిణీ చేయాలని, ముందు గా లబ్ధిదారులు చెల్లించాలని, బ్యాంకులో సబ్సిడీ జమ చేస్తామనే జిమ్మిక్కులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయకూడదని కోరారు.

ఇంటిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

వైరా, మార్చి 1: వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించవల్సిన ఇంటి పన్నుల బకాయిలపై 90శాతం వడ్డీమాఫీ వర్తిస్తుందని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు తెలిపారు. ఇంటి యజమానులందరూ పాత బకాయిలను పదిశాతం వడ్డీతో చెల్లించి లబ్ధిపొందాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కల్లూరు, మార్చి 1: మండలంలోని తెలగవరం గ్రామా సమీపాన ఓ మామిడి తోటలో శుక్రవారం పేకాట స్థావరంపై స్థానిక పోలీసు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మండ లంలోని తెలగవరం గ్రామా సమీపాన మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందగా ఎస్ఐ షాకీర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సంఘటనలో రూ.14,500 నగదుతో పాటుగా నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.